సాక్షి
బాపట్ల
బుధవారం। 7। మే। 2025



శిక్షణ తరగతులు పరిశీలన

చుండూరు(వేమూరు): వలివేరు గ్రామంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్తమ్మ పరిశీలించారు.



వైభవంగా బ్రహ్మోత్సవాలు

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లి సమేత సాక్షి భావన్నారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు.

దుర్గ గుడి ఈఓగా శీనానాయక్



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఈఓగా శీనా నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

న్యూస్‌రీల్

అడిషనల్ ఎస్పీగా బాపట్ల డీఎస్పీకి ఉద్యోగోన్నతి



బాపట్లటౌన్: బాపట్ల డీఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న జి.రామాంజనేయులకు అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందిన రామాంజనేయులను ఎస్పీ తుషార్‌డూడీ అభినందించారు.

మూడు పంచాయతీలకు క్షయవ్యాధి నిర్మూలన అవార్డులు

అద్దంకి రూరల్: కుష్టు, క్షయ, హెచ్ఐవీ నిర్మూలనకు తీసుకున్న చర్యలకు గాను అద్దంకి మండలంలోని గోపాలపురం, పేరాయపాలెం, ఉప్పలపాడు మూడు గ్రామ పంచాయతీలకు అవార్డులు లభించాయి. ఈమేరకు ఎంపీడీవో సింగయ్య మంగళవారం తెలిపారు.

నేడు బాపట్లలో మాక్‌డ్రిల్

బాపట్లటౌన్: ఉగ్రదాడుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బాపట్ల మండలంలోని సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, బాపట్ల పట్టణంలోని ప్రజలకు డిఫెన్స్ ఎక్సరైజ్‌లో భాగంగా మాక్‌డ్రిల్ కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి మంగళవారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7.30 గంటలకు సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, 10 గంటలకు బాపట్ల పట్టణంలో మాక్‌డ్రిల్ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో దాడులు జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బ్రీఫింగ్ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పోలీస్, ఎయిర్‌ఫోర్స్, రెవెన్యూ అధికారులు పాల్గొంటారన్నారు.

జెడ్పీ బడ్జెట్‌ను ఆమోదించిన ప్రభుత్వం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రభుత్వం ఆమోదించింది. ఈమేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. గత మార్చి 31 నాటికే ఆమోదం పొందాల్సిన బడ్జెట్‌ను ఆమోదించలేకపోవడంతో పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 199 సబ్ రూల్ 3 కింద బడ్జెట్ ఆమోదం కోసం జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు గత నెలలో ప్రభుత్వానికి పంపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.643 కోట్ల ఆదాయంతో రూపొందించిన అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు.

కోర్టును సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



పొన్నూరు: జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి మంగళవారం పట్టణంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును సందర్శించారు. నూతనంగా నిర్మాణం చేపట్టాల్సిన కోర్టు భవనాలకు సంబంధించిన విషయాలను తెలుసుకున్నారు. ఆయనకు కోర్టు న్యాయమూర్తి ఏకా పవన్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజీ సాహెబ్, సభ్యులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పొందుగుల జయరాజు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ తూమాటి రమేష్, ఏజీపీ ఎస్.శ్రీనివాస్, న్యాయవాదులు, గుమస్తాలు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో పోలీసుల బదిలీలు

నగరంపాలెం: జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌ల్లో ఐదేళ్లు పూర్తయిన కానిస్టేబుళ్ల నుంచి ఏఎస్‌ఐలకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో బదిలీల ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పర్యవేక్షించారు. 12 మంది ఏఎస్‌ఐలు, 27 మంది హెడ్ కానిస్టేబుళ్లు, మరో 27 మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ సమర్థంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలందించేందుకు అందుబాటులో ఉండాలని చెప్పారు. బదిలీ అయిన వారు పోలీస్‌స్టేషన్ల పరిధిలో నివసించాలని అన్నారు. తద్వారా కుటుంబ సభ్యులతో జీవించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ జీవీ.రమణమూర్తి (పరిపాలన), ఏవో అద్దంకి వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్పీ సీసీ ఆదిశేషు, జూనియర్ సహాయకులు మల్లికార్జునరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

మద్దతు మిథ్య.. మార్క్‌ఫెడ్ మాయ!


- పెసర, శనగ, కంది, మినుము కొంటామన్న ప్రభుత్వం
- మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాలో 62 కేంద్రాలు ఏర్పాటు
- 48 కేంద్రాల్లో ఒక్క గింజ కూడా కొనని వైనం
- జిల్లాలో సగటున లక్ష టన్నుల దిగుబడి అంచనా
- ఇప్పటివరకూ మార్క్‌ఫెడ్ కొన్నది 958 టన్నులే
- ఆలస్యంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- మద్దతు ధరకు పంటలు కొనని సర్కార్
- పలు రకాల ఆంక్షలతో రైతులకు తప్పని వేధింపులు
- ధర తక్కువైనా దళారులకే విక్రయిస్తున్న అన్నదాతలు

మద్దతు ధరకు పంట కొంటామన్న కూటమి సర్కార్ మాట తప్పింది. పేరుకు జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ప్రకటించినా.. పలు రకాల ఆంక్షలు విధించి మొక్కుబడిగా కూడా కొనుగోలు చేయలేదు. రైతులు తక్కువ ధరకే దళారులకు పంటలు అమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో అన్ని పంటలకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేసి ఆదుకోగా... చంద్రబాబు ప్రభుత్వం అందుకు భిన్నంగా అన్నదాతలను వంచిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో రైతులు సాగు చేసిన శనగ, మినుము, పెసర, కంది, మొక్కజొన్న వంటి పంటలను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు అంటూ జిల్లా వ్యాప్తంగా 50 రోజుల క్రితం 62 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. నామమాత్రంగా కూడా కొనుగోళ్లు జరగకపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

పంటలవారీగా దుస్థితి ఇదీ..

- ప్రధానంగా పెసలు 8 వేల టన్నుల దిగుబడి ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మద్దతు ధర క్వింటాకు రూ.8,862గా ప్రభుత్వం నిర్ణయించింది. బయట మార్కెట్‌లో రూ.7 వేల లోపు వస్తోంది. మార్క్‌ఫెడ్ సేకరణ లక్ష్యం 3,500 టన్నులు. కానీ ఇప్పటివరకు 869 టన్నులు మాత్రమే సేకరించింది. తేమ శాతం, నాణ్యత, పరిమాణం అంటూ రకరకాల కారణాలు చూపి పంటలను కొనుగోలు చేయడం లేదు.
- జిల్లాలో అద్దంకి, పర్చూరు ప్రాంతాల్లో ఈ ఏడాది రైతులు కంది పంట సాగు చేశారు. 190 టన్నుల దిగుబడి ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మద్దతు ధర క్వింటాకు రూ.7,550గా నిర్ణయించారు. బయట మార్కెట్‌లో రూ.6 వేలకు మించి లేదు. ప్రభుత్వం 12 శాతం లోపు తేమ, పరిమాణం, నాణ్యత, క్వింటాకు 4 కిలోల తరుగు పేరిట ఆంక్షలు అమలు చేసి పట్టుమని 69 టన్నులకు మించి కూడా కొనలేదు.



మినుము
కందులు
మినుము పంట

- జిల్లాలో ఒక మోస్తరుగా రైతులు మినుము సాగు చేయగా, సుమారు 35 వేల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. క్వింటాకు మద్దతు ధర రూ.7,400గా నిర్ణయించారు. కానీ ప్రభుత్వం ఇప్పటివరకూ కేవలం 19 టన్నులు సేకరించింది.
- జిల్లాలో 45 వేల టన్నుల వరకు శనగ దిగుబడి ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మార్క్‌ఫెడ్ లక్ష్యం 5 వేల టన్నులుగా ప్రభుత్వం నిర్దేశించింది. క్వింటా ధర రూ.5,650గా నిర్ణయించారు. కానీ ఒక్క టన్ను కూడా ప్రభుత్వం కొనుగోలు చేయలేదు.
- మొక్కజొన్న 23,500 హెక్టార్లలో సాగు చేశారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.3,371 గా నిర్ణయించింది. ఇప్పటివరకు పంట కొనుగోలుపై సర్కారు ఎలాంటి నిర్ణయం ప్రకటించ లేదు. మొక్కజొన్న కొనే వారు లేక రైతులు పంటను కల్లాల్లోనే వదిలేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.



మరీ ఇంత తక్కువా?

వాస్తవానికి మినుము 35,000, శనగ 45,000, మొక్కజొన్న 23,500, పెసర 8,000, కంది 190 టన్నుల చొప్పున మొత్తం 1,11,690 టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా కట్టింది. మార్క్‌ఫెడ్ నిర్దేశిత లక్ష్యాల మేరకు పెసర 3,500, శనగ 5000, కంది 190 టన్నులుగా నిర్దేశించారు. ఆ ప్రకారం చూసినా 8,690 టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకూ 958 టన్నులు మాత్రమే మార్క్‌ఫెడ్ కొని చేతులు దులుపుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో మొత్తం 62 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 48 కేంద్రాల నుంచి ఒక్క క్వింటా కూడా కొనుగోలు చేయకపోవడంపై అన్నదాతలు మండిపడుతున్నారు.

మద్దతు ధరకు కందులు కొనలేదు

నేను 1.50 ఎకరాల్లో కంది సాగు చేశా. నాలుగు క్వింటాల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం మద్దతు ధర క్వింటా రూ.7,750 అని చెప్పినా అధికారులు నానా రకాల ఆంక్షలు పెట్టి కొనలేదు. 12 లోపు తేమ శాతం పేర్కొన్నారు. క్వింటాకు 4 కిలోల తరుగు తీసుకుంటామన్నారు. జల్లెడ పెట్టి పెద్ద సైజు ఉంటేనే కొంటామని చెప్పారు. నాణ్యత విషయంలోనూ ఆంక్షలు పెట్టి సక్రమంగా కొనుగోలు చేయలేదు. దీంతో కందులు ఇంట్లోనే ఉంచుకున్నా. కొందరు రైతులు దళారులకు తక్కువ ధరకు విక్రయించారు.

– రాంబాబు, రైతు, తిమ్మాయిపాలెం, అద్దంకి మండలం.

సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేసే అవకాశం

బాపట్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం సమర్థంగా పని చేస్తోందని తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగే గ్రీవెన్స్‌లో ప్రజలు నేరుగా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదులు చేయవచ్చన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలకు సమస్యలు చెప్పవచ్చన్నారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి కూడా ఫిర్యాదు చేయడానికి 1100 నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. వాట్సాప్ గవర్నర్స్ ద్వారా నంబర్ 91 95523 00009 కు హాయ్ అని పంపి సేవలను పొందవచ్చని తెలిపారు.

ఉప్పు భూములకు మార్కెట్ ధర నిర్ణయించాలి

ఉప్పు భూములను పరిశీలించి, వాటికి మార్కెట్ ధర నిర్ణయించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఉప్పు భూముల పరిశీలన, ధరల నిర్ధారణపై అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. సాల్ట్ భూములు ఉన్న ప్రాంతాలను పరిశీలించాలని చెప్పారు. ఇందు కోసం జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా పరిధిలోని చిన్నగంజాం మండలంలో 2,486 ఎకరాల భూములు సాల్ట్ కమిషన్ అధీనంలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆ భూములను సర్వే చేయాలన్నారు. ఆ భూమి ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు. జిల్లా స్థాయి కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. తదుపరి ఆ ప్రాంతంలో మార్కెట్ ధరలు, సాల్ట్ భూముల విలువను నిర్ధరణ చేస్తూ ధరలపై నివేదిక సమర్పించాలన్నారు. సమావేశంలో డీఆర్వో జి గంగాధర్ గౌడ్, జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారి, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల బియ్యం పక్కదారి

- జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న దందా
- పలుచోట్ల అడ్డగోలుగా ఇసుక తరలింపు

చీరాల: పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. అర్హులకు అందాల్సిన బియ్యాన్ని అక్రమార్కులు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. అధికారులు అక్కడక్కడా పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నా ఈ దందాను నిలువరించలేకపోతున్నారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నాయి. జిల్లాతోపాటు పక్కనే ఉన్న పల్నాడు, గుంటూరు జిల్లాల నుంచి కూడా అక్రమ వ్యాపారం చేసే వారు క్యూ కడుతున్నారు. దందా నిర్వహించే వారికి స్థానిక ప్రజాప్రతినిధులు కూడా తెరవెనుక అభయ హస్తం అందిస్తున్నట్లు సమాచారం.

నెలలో పది రోజులే వ్యాపారం...

ప్రభుత్వం పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రతి నెల ఒకటోతేదీ నుంచి పంపిణీ చేస్తున్నారు. కొంత మంది డీలర్లతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఎక్కువ మంది డబ్బులకు విక్రయిస్తున్నారు. కార్డుదారుల నుంచి కేజీ రూ.10 చొప్పున, డీలర్ల నుంచి రూ.15కు తీసుకుంటున్నారు. తర్వాత మిల్లులకు తరలించి పాలిష్ పట్టాక దూర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల అనుచరులు కూడా అక్రమార్కులతో కుమ్మక్కు అవుతున్నారు.

విలేకర్లు 'విజిలెన్స్' అవతారం..

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, పోలీసులు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేసి, సీజ్ చేస్తుంటారు. తాజాగా విలేకర్లు ఈ విజిలెన్స్ అధికారుల అవతారమెత్తారు. ఇటీవల పర్చూరు నుంచి చీరాలకు లారీలో రేషన్ బియ్యాన్ని రాత్రి వేళ తరలిస్తున్నారనే సమాచారం రావడంతో ఐదుగురు విలేకర్లు కారులో వెంబడించారు. లారీని ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారులకు చెబుతామని దండుకున్నారు. ఈ ఉదంతం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. అక్రమార్కులు కూడా ఎందుకొచ్చిన గొడవ అన్నట్లు కొంత ముట్టజెప్పారు. ఈ వ్యవహారం పత్రికలకు ఎక్కింది.



గతంలో స్వర్ణలోని ఓ ప్రజాప్రతినిధికి చెందిన రైస్ మిల్లులో రేషన్ బియ్యం ఉన్నట్లు మీడియాలో రాగా డబ్బులు డిమాండ్ చేశారు. ఆయన కారంచేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గుంటూరుకు చెందిన విలేకరులపై కేసు నమోదు చేశారు. కొందరు విలేకర్లు హైవేలపై కూడా ట్రాన్స్‌పోర్టు లారీలను ఆపి డబ్బులు దండుకుంటున్నారు.

అవే అక్రమార్కులకు సిరులు...

రేషన్ బియ్యం తరలింపుతోపాటు జిల్లాలో ఇసుక అక్రమ రవాణా కూడా జోరుగా సాగుతోంది. ఈ రెండూ అక్రమార్కులకు రెండు కళ్లు. సిరులు కురిపించే అక్రమ వ్యాపారాలు చేయడానికి పెద్ద ఎత్తున పోటీ పడుతున్నారు. అధికార పార్టీలో ప్రజాప్రతినిధులకు చెందిన రెండు వర్గాలు ఇసుక రవాణా చేసేందుకు పోటీ పడ్డాయి. గతంలో ఇసుక తవ్వడానికి వినియోగించిన జేసీబీని దహనం చేయడం వంటి సంఘటనలు జరిగాయి. జిల్లాలో చీరాల, రేపల్లె, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల పరిధిలోని ఇసుకను లారీల ద్వారా దూర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి వేళల్లో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇసుకాసురుల ధన దాహానికి తీర ప్రాంతాలు కుంచించుకుపోతున్నాయి. వందల అడుగుల లోతున జేసీబీలతో ఇసుకను తవ్వుతూ పర్యావరణానికి పెనుముప్పు కలిగిస్తున్నారు. అధికారులు నామమాత్రపు తనిఖీలు చేసి కేసులతో సరిపెడుతున్నారు.

పచ్చ దందా.. రేణువైనా మిగులుతుందా?

- ఉచితం మాటున యథేచ్ఛగా ఇసుక తరలింపు
- యంత్రాలతో నదిలో అడ్డగోలుగా తవ్వకాలు
- రేయింబవళ్లు యంత్రాల వినియోగం
- స్థానిక కూలీలకు పని లేక ఇబ్బందులు
- ఇతర రాష్ట్రాలకు తరలుతున్న వందల లారీల లోడ్‌లు
- అందినకాడికి దండుకుంటున్న పచ్చ నాయకులు
- కనీస చర్యలు కూడా తీసుకోని అధికారులు
- ఏజెన్సీ మార్పు పేరిట ఏమార్చి బినామీల దోపిడీ

ఉచిత ఇసుక మాటున అధికార కూటమి ప్రభుత్వంలోని పచ్చ నేతలు అక్రమ దందాకు తెరలేపారు. నిబంధనలకు నీళ్లొదిలి యథేచ్ఛగా నదిలో భారీ యంత్రాలను వినియోగించి ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. అందినకాడికి జేబులు నింపుకొంటున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

కొల్లూరు: టీడీపీ నాయకులు ధనార్జనే ధ్యేయంగా తెగిస్తున్నారు. నదిలో భారీ యంత్రాలను వినియోగిస్తూ నేరుగా లారీలకు ఇసుక లోడింగ్ చేస్తూ ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. తమ జేబులు నిండితే చాలన్నట్లు వ్యవహరిస్తున్నారు. కృష్ణా నదీ గర్భాన్ని తోడేస్తూ చట్టాలకు అతీతంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇసుక అక్రమార్కులు ఆయా అధికారులకు భారీగా ముడుపులు ముట్టజెప్పడమే దీనికి కారణమని ప్రజలు చర్చించుకుంటున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా వందల సంఖ్యలో లారీల ద్వారా ఇసుక రాష్ట్ర సరిహద్దులు దాటుతోంది.

ఏజెన్సీలు మారినా అదే తీరు

నిబంధనల మేరకు ఇసుక తవ్వకాలు చేపట్టాల్సి ఉండగా టీడీపీ నాయకులు వాటిని పాటించడం లేదు. గాజుల్లంక ఇసుక క్వారీలో తొలి నుంచీ అక్రమాలు ఉన్నాయి. వీటికి అడ్డుకట్ట వేసే పేరుతో అధికారులు రెండు పర్యాయాలు ఏజెన్సీలను మార్చినా ప్రయోజనం మాత్రం శూన్యం. అధికారికంగా ఏజెన్సీల పేర్లు మారినప్పటికీ వాస్తవానికి పాత వారే బినామీలుగా ఉన్నారనేది బహిరంగ రహస్యంగా మారింది. నదిలో యంత్రాలను వినియోగించకుండా చర్యలు చేపట్టకపోవడానికి ఆ క్వారీ నిర్వాహకుల నుంచి పెద్ద మొత్తంలో అందుతున్న తాయిలాలే ప్రధాన కారణమన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. తాజాగా మండలంలోని గాజుల్లంక-2 క్వారీని త్రిలోక్య ఎంటర్‌ప్రైజెస్ ఏజెన్సీకి అధికారులు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. పాత నిర్వాహకులే బినామీగా ఉండటం గమనార్హం.



గాజుల్లంక వద్ద లారీలలో నేరుగా యంత్రాలతో ఇసుక లోడింగ్ చేస్తున్న అక్రమార్కులు



గాజుల్లంక-2 క్వారీ నుంచి పరిమితికి మించిన ఇసుక లోడ్‌తో రవాణా చేస్తున్న దృశ్యం

కూలీలకు ఉపాధి కరవు

గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను విస్మరిస్తూ పచ్చ నాయకులు యంత్రాలను వినియోగిస్తున్నారు. దీని వల్ల కూలీలకు ఉపాధి లేకుండాపోతోంది. ట్రాక్టర్లలో కూలీల ద్వారా ఇసుక లోడింగ్ చేపట్టి డంపింగ్ యార్డుకు తరలించాలి. అక్కడ అనుమతించిన యంత్రాల సంఖ్యకు మించకుండా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటలలోపు లారీలకు లోడింగ్ చేసుకోవడానికి అనుమతి ఉంది. త్రిలోక్య ఎంటర్‌ప్రైజెస్‌కు కేటాయించిన గాజుల్లంక-2 క్వారీలో 4.950 హెక్టార్లలో 31,501 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు కూలీల ద్వారా చేపట్టి, ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించాలి. కానీ లారీలను నదిలోకే దింపి ఇసుక లోడింగ్ చేస్తున్నారు. వందల మంది కూలీల పొట్టకొట్టడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

హద్దులు దాటుతున్న ఇసుక

లెక్కలు లేకుండా భారీ లారీలలో తరలుతోంది. రోజుకు దాదాపు 200కు పైగా లారీలలో రాష్ట్ర సరిహద్దులు దాటుతోంది. ప్రధానంగా హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు తెలిసింది. అధికారుల తీరుతో నదీ పరివాహక గ్రామాలు తీవ్ర ముప్పు బారిన పడే ప్రమాదం పొంచి ఉందన్న ఆవేదన ప్రజలలో ఉంది. యంత్రాలతో భారీ గోతులు పెడుతుండటంతో భూగర్భ జలాలు అడుగంటి తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. ఈ అంశం మైనింగ్ ఏడీ రాజేష్ దృష్టికి తీసుకువెళ్లి వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదు.

10, 11 తేదీల్లో క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో 10వ తేదీన అండర్-23 మెన్ జిల్లా క్రికెట్ పోటీలను, 11వ తేదీని సీనియర్ జట్టు ఎంపికను నిర్వహిస్తామని త్రీమెన్ కమిటీ సభ్యుడు మహతీ శంకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలను స్థానిక అరండల్‌పేటలోని పిచ్చుకలగుంట క్రీడా మైదానంలో ఏర్పాటు చేసామన్నారు. ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. పాల్గొనే క్రికెటర్లు కావాల్సిన డాక్యుమెంట్లతో రావాలని తెలిపారు. ప్రతి క్రికెటర్ వైట్ డ్రెస్‌తోపాటు సొంత కిట్ తీసుకు రావాలన్నారు.

నాలుగు లైన్ల రహదారితో మేలు

బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాద్

గుంటూరు వెస్ట్: అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు నుంచి నిజాంపట్నం పోర్టు వరకు నూతనంగా నిర్మించనున్న నాలుగు లైనుల (గ్రీన్ ఫీల్డ్) రోడ్డు నిర్మాణంతో ఎందరికో మేలు జరుగుతోందని బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ శంకరన్ హాలులో స్టేక్ హోల్డర్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఎంపీతోపాటు, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి, గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, బాపట్ల ఎమ్మెల్యే వి.నరేంద్రవర్మ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా పాల్గొన్నారు. ఎంపీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అమరావతి రింగ్‌రోడ్డు నుంచి నిజాంపట్నం పోర్టు వరకు 47.848 కిలోమీటర్లు నాలుగు లైనుల రోడ్డు నిర్మాణం వల్ల ఎన్నో ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రోడ్డు నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చామన్నారు. ఆరు మాసాల్లో నిర్మాణ పనులకు అనుమతులు పొందిన తరువాత మరో 18 నెలల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, బాపట్ల జిల్లా కలెక్టర్ మురళిలు మాట్లాడుతూ ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ, ఇరిగేషన్, ఫిషరీస్, వ్యవసాయం, పంచాయతీరాజ్, దేవాదాయ శాఖ, అటవీ శాఖ అధికారులు వారి వారి శాఖలకు సంబంధించి ఏవైనా అంశాలు ఉంటే పూర్తి వివరాలతో శుక్రవారం సాయంత్రంలోపు అందించాలని పేర్కొన్నారు. అనంతరం రోడ్డు నిర్మాణానికి సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను నేషనల్ హైవే అథారిటీ అధికారులు వివరించారు. సమావేశంలో ఎన్‌హెచ్ ఏఐ పార్వతీశం, డీఆర్వో షేక్ ఖాజావలి, డీపీఓ నాగసాయికుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ టి.కృష్ణప్రసాద్, చిత్రంలో ఎమ్మెల్యేలు, కలెక్టర్లు

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	1,04,743
అమ్మకాలు (గత నిల్వలతో కలిపి)	1,12,001
నిల్వ	37,465

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 - 13,200
నంబరు-5	రూ. 10,000 - 12,500
273	రూ. 10,000 - 12,400
341	రూ. 10,000 - 13,300
4884	రూ. 10,000 - 11,200
తాలుకాయలు	రూ. 4,500 - 6,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 - 13,800
షార్క్-1	రూ. 10,000 - 12,000
బాడిగ - 355	రూ. 10,000 - 13,000
దేవనూరు డీలక్స్	రూ. 10,000 - 12,600
ఆర్మూర్	రూ. 9,800 - 11,200
తాలు	రూ. 4,500 - 6,500

-కొరిటిపాడు (గుంటూరు)

పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు, నాగమల్లేశ్వరరావు, తదితరులు

లక్ష్మీపురం: బర్లీ పొగాకును నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం బ్రాడీపేటలోని కౌలు రైతు సంఘం జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో హరిబాబు పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఈ సంవత్సరం 86 వేల ఎకరాలు బర్లీ పొగాకును రైతాంగం అనేక వ్యయ ప్రయాసలకోర్చి సాగు చేశారన్నారు. గతంలో క్వింటా రూ. 18వేలకు కొనుగోలు చేయగా ఈ సంవత్సరం రూ.4వేలు మాత్రమే ధర పలికిందన్నారు. రైతాంగం అప్పులు చేసి పంట సాగు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగి క్వింటా రూ.15 వేలకు కొనుగోలు చేయాలని కోరారు. వ్యవసాయ శాఖామంత్రి, కంపెనీల అధికారులు వెంటనే స్పందించి పొగాకు కొనుగోలు చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఈదురుగాలులకు నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ కార్మికులు, రైతాంగం, పేద ప్రజలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను, గ్రామీణ హర్తాళ్ ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మిర్చి, వరి, కంది పెసర, అరటి, శనగ పంటలను మద్దతు ధరలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతులకు, దేవాలయ భూములు సాగు చేసే రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. గుంటూరు ఛానల్ పనులు ప్రారంభించాలని, నల్లమడ ఆధునికీకరణకు నిధులు కేటాయించాలని సమావేశంలో తీర్మానం చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బొట్ల రామకృష్ణ, నాగమల్లేశ్వరరావులు ఎన్నికయ్యారు. సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు ములకా శివ సాంబిరెడ్డి, పి కృష్ణ, అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



శక్తి యాప్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బాపట్లటౌన్: శక్తియాప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ ఆవశ్యకత, వినియోగం దానిలో నిక్షిప్తం చేయబడిన పలు అంశాల గురించి మంగళవారం జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ జిల్లాలోని శక్తి బృందాలు జిల్లాలోని కోచింగ్ సెంటర్స్, ఫ్యాక్టరీలు, మాల్స్, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ఇతర కార్యాలయాలు, జన సమూహం ఉండే ఇతర ప్రదేశాలతోపాటు జిల్లాలోని పలు ముఖ్యమైన ప్రాంతాల్లో మహిళలకు అవవగాహన కల్పించారు. మహిళలకు శక్తి యాప్‌ను ఏ విధంగా వారి మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవాలి, వినియోగించే విధానం, యాప్‌లో పొందుపరచబడి ఉన్న విస్తృతమైన సమాచారం గురించి వివరించినారు. వాటితో పాటు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల నిషేధ చట్టం, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టం, వివిధ హెల్ప్ లైన్ నెంబర్లు వాటిని వినియోగించుకునే విధానంపై అవగాహన కల్పించారు.

నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలని వినతి



రైతులతో మాట్లాడుతున్న రాజశేఖర్

పర్చూరు(చినగంజాం): ప్రభుత్వమే నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలని పర్చూరు నియోజకవర్గ పరిధిలోని పలువురు రైతులు అధికారులను కోరారు. పర్చూరు శాసన సభ్యుడు ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో బుధవారం ఉప్పుటూరు గ్రామంలో పలు విషయాలను ఉన్నతాధికారులకు వివరించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతులు, రైతు నాయకులు మాట్లాడారు. వ్యాపారులు కొనుగోలు చేయటానికి ముందుకు రావటం లేదని, విదేశాల్లో ఉన్న ప్రస్తుత అనిశ్చితి పరిస్థితుల్లో పొగాకు ఎగుమతులకు ఆదరణ లేనందున ఈ పరిస్థితి నెలకొందని రైతులు వివరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని కోరారు. దీనిపై ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి (వ్యవసాయ సహకారం) బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ పొగాకు వ్యాపారులతో బుధవారం వెలగపూడి సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి పొగాకు కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేలా వారిని ఒప్పిస్తామని తెలియజేశారు. రైతులను పూర్తి స్థాయిలో ఆదుకుంటామని ప్రభుత్వం తరఫున ఆయన భరోసా ఇచ్చారు. వ్యవసాయ సంచాలకులు ఢిల్లీ రావు మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయించడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలను తెలియజేశారు. తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలను సీఎం ఆదేశించినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

అవార్డు స్వీకర్తకు అభినందన



బల్లికురవ: ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గుంటుపల్లి సర్పంచ్ మాదాల కృష్ణకుమారి అవార్డు అందుకోవటం అభినందనీయమని ఎంపీడీఓ కుసుమ కుమారి, డిప్యూటీ ఎంపీడీఓ దాసరి సుమతి కొనియాడారు. క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంళవారం బాపట్లలో 2024 - 25 సంవత్సరాని టీబీ ముక్త పంచాయతీ అవార్డును సర్పంచ్ కైవసం చేసుకున్నారు. జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావు చేతుల మీదుగా ఈ అవార్డును సర్పంచ్‌తోపాటు సెక్రటరీ నూర్ అహ్మమద్ అందుకున్నారు.

తొండపిలో ఘర్షణ

ముప్పాళ్ల: ఇరువురి మధ్య వివాదం ముదిరి జరిగిన ఘర్షణలో ఒకరికి తలకు గాయమైన సంఘటన మండలంలోని తొండపి గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన దుగ్గినేని రామారావు, చల్లా శ్రీనివాసరావుల మధ్య వివాదం జరిగింది. వివాదం ముదిరి రామారావు గడ్డపారతో శ్రీనివాసరావు తలపై కొట్టడంతో తలకు తీవ్రగాయమైంది. గుంటూరు పోలీసులు ఆమెను టూరుకు తరలించారు.

చలపతి ఇంజినీరింగ్ కళాశాలకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్



అక్రిడిటేషన్ పత్రాలు చూపుతున్న చలపతి విద్యా సంస్థల కార్యదర్శి సుజిత్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మోతడక (తాడికొండ): మోతడక చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ప్రొగ్రామ్‌లకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ న్యూ ఢిల్లీ మూడు సంవత్సరాల కాల వ్యవధితో రెండోసారి అక్రిడిటేషన్ మంజూరు చేసిందని కళాశాల చైర్మన్ వై.వి.ఆంజనేయులు తెలిపారు. ఎన్‌బీఏ ఇచ్చిన ఎక్స్‌పర్ట్ కంపెనీ ఫిబ్రవరి 15న కళాశాలను సందర్శించి వసతులు, పాటిస్తున్న విద్యా ప్రమాణాలు, జరుగుతున్న పరిశోధన, అభివృద్ధికి సంబంధించిన విషయాలు, అధ్యాపకుల ప్రమాణాలు, సంస్థలో పాటిస్తున్న విద్యాబోధన, తదితర వాటిని పరిశీలించి అక్రిడిటేషన్ మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈసందర్భంగా కళాశాలకు అక్రిడిటేషన్ గుర్తింపు రావడంపై చైర్మన్ వై.వి.ఆంజనేయులు, కార్యదర్శి వై.సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగశ్రీనివాస్ లు హర్షం వ్యక్తం చేశారు. గుర్తింపు రావడానికి కారకులైన విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఫణికుమార్, డాక్టర్ పి.బాలమురళీకృష్ణ, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ జయకృష్ణ, పలు శాఖాధిపతులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో పతకాల పంట



పతకాలు అందుకున్న విద్యార్థులతో కోచ్ శ్రీనివాసరావు

తెనాలిఅర్బన్: ఇండియన్ తైక్వాండో వారు నిర్వహించిన ఫస్ట్ ఫెడరేషన్ కప్, కిడ్స్ చాంపియన్ షిప్ పోటీల్లో తెనాలి కెఎస్ఆర్ తైక్వాండో అకాడమికి చెందిన షణ్ముఖ అభిరామ్, లంకరాజు శిరీషలకు బంగారు పతకాలు, లంకరాజు శ్రీ శౌర్యకు వెండి పతకం లభించినట్లు కోచ్ కె.శ్రీనివాసరావు తెలిపారు. వీటిని మహారాష్ట్రంలో ఏప్రిల్ 25నుంచి మే ఒకటి వరకు నిర్వహించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం అకాడమి ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో వీరవల్లి మురళి, కె.నాగభూషణం, టి.పోతురాజు, కె.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూతో అనుబంధం రద్దుకు ఏకగ్రీవం

చీరాల: ఏపీ ఫెడరేషన్ ఆఫ్ ఐయల్‌టీడీ కంపెనీ వర్కర్స్ యూనియన్.. సీఐటీయూతో అనుబంధం రద్దు చేసుకోవడానికి ఏకగ్రీవంగా తీర్మానించిందని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిప్పలపల్లి శివరాజు మంగళవారం తెలిపారు. ఇటీవల జరిగిన మహాసభలో ఈ మేరకు ప్రకటించామన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా చిప్పలపల్లి శివరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గంట సుధీర్, రాష్ట్ర కోశాధికారిగా పఠాన్ నాగూర్ మీరాలతో పాటు 25 మంది రాష్ట్ర ఆఫీస్ బేరర్స్‌గా ఎన్నికయ్యారన్నారు. ఎన్నికైన వారిని ఫ్యాక్టరీ మేనేజర్, పర్సనల్ మేనేజర్లుకు పరిచయం చేశారు.

నేడు పేరేచర్ల-కొండమోడు రహదారి విస్తరణకు శంకుస్థాపన

సత్తెనపల్లి: తాటికొండ నియోజకవర్గం మేడికొండూరు మండలం పేరేచర్ల-సత్తెనపల్లి నియోజక వర్గం రాజుపాలెం మండలం కొండమోడు నాలుగు లైన్‌ల రహదారి విస్తరణ పనులకు బుధవారం సాయంత్రం 4.00 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి రోడ్లు, భవనాలు, మౌలికసదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి హాజరుకానున్నారు. రాజుపాలెం మండలం రెడ్డిగూడెం వద్ద ఏర్పాటుచేసిన నేషనల్ హైవే (ఎన్‌హెచ్ -167 ఏజీ)కి సంబంధించిన నాలుగు లైన్‌ల రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఆయనతోపాటు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ (సత్తెనపల్లి), యరపతినేని శ్రీనివాసరావు(గురజాల), భాష్యం ప్రవీణ్(పెదకూరపాడు), తెనాలి శ్రావణ్ కుమార్(తాటికొండ) పాల్గొననున్నారు.

అండగా మేమంతా ఉన్నాం

జెడ్పీటీసీ రజనీని పరామర్శించిన బత్తుల బ్రహ్మానంద రెడ్డి



జెడ్పీటీసీ మెంబర్ రజనీ శ్రీనివాసరావును పరామర్శిస్తున్న బత్తుల బ్రహ్మానంద రెడ్డి

కారంచేడు: అనారోగ్యంతో కొంత కాలంగా చికిత్స పొందుతున్న కారంచేడు జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీ శ్రీనివాసరావును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రకాశం జిల్లా వైఎస్సార్ సీపీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి కలిసి పరామర్శించారు. మంగళవారం మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలోని జెడ్పీటీసీ సభ్యురాలి గృహానికి వచ్చిన బత్తుల ఆమెను చూసి చలించిపోయారు. ఎంతో యాక్టివ్‌గా ఉండేవారన్నారు. అనారోగ్యాలను బట్టి కృంగి పోకూడదని, ధైర్యంగా ఉండాలని, మేమంతా మీకు అండగా ఉంటామని ఆమె ధైర్యం చెప్పారు. ఆరోగ్య పరిస్థితులపై ఆయన ఆరా తీశారు. చికిత్స జరుగుతున్న తీరును కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండి అనారోగ్యాన్ని జయించి మరలా మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. స్టేట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పి. ఏడుకొండలు, యర్రం లక్ష్మారెడ్డి, గోగినేని బుల్లెబ్బాయి, యార్లగడ్డ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ నర్సింగ్(Girls) MLT వెటర్నరీ, అగ్రికల్చర్, ఫిజియోథెరపీ కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. బాల బాలికలు హాస్టల్ వసతి కలదు. 7386706839, 7780494333

REAL ESTATE
■ అమరావతి మునుగోడు వద్ద ఎర్రచందనం చెట్టు 60 అడుగుల రోడ్డులో వెంచర్ వేసిన దానికి ప్రక్కన 1.10 సెంట్లు 80ల. 9502736614, 9949284105

SERVICES

BUSINESS OFFER
■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి. సలహాలకి కాల్ చేయండి : 7406393937

GOLD FINANCE
■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

WANTED
■ డ్రైవర్స్ కావలెను. ఆటోమెటిక్ మరియు మాన్యువల్ కారు నడిపిన అనుభవం ఉండవలెను. తగిన లైసెన్స్ ఉండాలి. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. అర్హతను బట్టి PF మరియు ESI సదుపాయం కలదు. పనిచేయు స్థలం: గుంటూరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 92487 22262
■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌స్, బ్లాక్ ఇన్‌ఛార్జ్‌స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 18000/- వరకు ఇవ్వబడును. (నాన్‌లోకల్ వారికి ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు, వయస్సు: 21 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు ఉండవలెను. సంప్రదించండి. ఫోన్ నెంబర్: 91541 52896
■ ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు పురుషులు వార్డెన్స్, హాస్టల్ ఇన్‌ఛార్జ్‌స్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌స్ కావలెను. వయసు: 21 సం. పైన ఉండవలెను. జీతము: 10000/- నుండి 25000/- వరకు ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 92487 33320
■ Wanted duty doctors , nurses, office staff, freshers accepted pls contact: 9494105148
■ గుంటూరు నందు పనిచేయుటకు టెలికాలర్స్ (F) ప్రమోటింగ్ టీం (M) కావలెను. Q: Any Degree, English Fluency is Must. అనుభవానికి ప్రాధాన్యత. జీతం: 15k to 20k. Freshers can Also Apply. ✆87499 77799
■ వంటమనిషి కావలెను. గుంటూరు పట్టణంలో ఏ.టి. అగ్రహారం నందు గృహములో వెజ్ మరియు నాన్‌వెజ్ అన్నిరకముల వంటలు చేయుటకు అనుభవము కలిగిన (ఆడ) వంట మనిషి కావలెను. ✆ 9398991579
■ గుంటూరు చంద్రమౌళినగర్‌లో ఇంటర్నేషనల్ కొరియర్ ఆఫీస్‌కు 35 సం॥ లోపు గల ప్యాకింగ్ బాయ్స్ కావలెను. అనుభవం గల వారికి ప్రాధాన్యత. అర్హత: 10th/ఇంటర్. ✆ 77992 56644
■ Wanted Sales Executives for Guntur with Min.of 2 yrs. Exp. in FMCG / LUBES / SPARES INDUSTRY at Guntur. Salary Rs. 22500+TA&DA to Work for Castrol India Ltd. ✆ : 9246487091
■ ప్రముఖ బ్యాంకింగ్ రికవరీ ఏజెన్సీ నరసరావుపేట, చిలకలూరిపేట, తెనాలి, చీరాల, గుంటూరు Local ఏరియాలలో పని చేయుటకు కావలెను. "Field Executives " (Salary 15K to 22K +Inct) సంప్రదించండి ✆ 92484 86177
■ శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను,పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావాలి. ఫ్రీ వసతి భోజనం. జీ: 18K. ఫోన్: 9912011499, 9912011899
■ SRI SARADHA NIKETAN Public School MARTUR, BAPATLA District Wanted Jobs: Maths, Physics, Chemistry. Qualification: M.sc, B.Ed (Exp :5-10 Yrs with JEE-MAINS, NEET) Data Entry Operators-2 Accountancy B.S-1 M.COM /MBA Ph no: 7095723036, 9398832060

గుంటూరు
7075167663
7075167541

గమనిక

ట్రావెల్స్ వాహనం బోల్తా
పలువురికి గాయాలు



బాధితుడిని క్యాబిన్ నుంచి వెలుపలికి తీస్తున్న దృశ్యం

మార్టూరు: జాతీయ రహదారిపై మంగళవారం టూరిస్ట్ వాహనం బోల్తా పడిన సంఘటనలో పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనం పూర్తి చేసుకుని విజయవాడ వైపు వెళుతున్న సుమారు 15 మంది ప్రయాణికులతో కూడిన ట్రావెల్స్ వాహనం మంగళవారం ఉదయం చిలకలూరిపేట వైపు వెళుతోంది. రాజుపాలెం కూడలి దాటిన తర్వాత ట్రావెల్స్ వాహనం ముందు వెళ్తున్న మరో వాహనాన్ని వేగంగా ఢీ కొట్టింది. ప్రమాద ధాటికి రహదారికి పడమర వైపు ప్రయాణిస్తున్న ట్రావెల్స్ వాహనం మధ్యలో ఉన్న డివైడర్‌ను దాటుకుంటూ రహదారికి తూర్పు వైపు గల పొలాల్లోకి పల్టీ కొట్టింది. ప్రమాద సమయంలో ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రమాదంలో డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న ఓ వ్యక్తి క్యాబిన్లో ఇరుక్కుపోగా స్వల్పంగా గాయపడిన మిగిలిన ప్రయాణికులు వాహనం క్యాబిన్ డోర్‌ను బలవంతంగా ఓపెన్ చేసి బాధితుడిని తమతో చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించుకొనివెళ్లారు.

లోడ్ కిందపడి కార్మికుడు మృతి



వేము ఆదినారాయణ మృతదేహం

చెరుకుపల్లి: ప్రమాదవశాత్తు తాటి మొద్దుల లోడ్ కిందపడి కార్మికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చెరుకుపల్లిలో చోటుచేసుకుంది. మండలంలోని ఆరుంబాక ఎస్సీ కాలనీకి చెందిన వేము ఆదినారాయణ (40) చెరుకుపల్లిలోని ఒక కోత మిషన్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం తాటి మొద్దుల లోడు దింపుతుండగా కింద పడ్డాడు. అతనిపై తాటి మొద్దులు పడ్డాయి. తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. ఆదినారాయణకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెరుకుపల్లి ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

జూలకల్లు గ్రామంలో కార్డన్ సెర్చ్
కొడవళ్లు, గడ్డపారలు, 30 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న కొడవళ్లు, గడ్డపారలు, గొడ్డళ్లు

పిడుగురాళ్లరూరల్: పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని జూలకల్లు గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించామని గురజాల ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.హనుమంతరావు చెప్పారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి 9 గంటల వరకు జూలకల్లు గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిలోనూ సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు, 11 కత్తులు, నాలుగు గడ్డపారలు, గొడ్డళ్లు, కొడవళ్లతోపాటు కర్రలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ జూలకల్లు గ్రామంలో ఫ్యాక్షన్ గొడవలు ఉన్నాయని, ముందస్తు చర్యలలో భాగంగానే ఈ గ్రామంలో ప్రతి ఇంటిలోనూ సోదాలు నిర్వహించామని తెలిపారు. ఇరుపార్టీల వారికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల సీఐ వెంకట్రావు, దాచేపల్లి సీఐ భాస్కర్‌రావు, గురజాల, సత్తెనపల్లి, గురజాల సబ్ డివిజన్‌పరిధిలోని ఎస్ఐలు వారి సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండకు సన్మానం



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న పెనుగొండ లక్ష్మీనారాయణ

వినుకొండ: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణను విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో స్థానిక జాషువా కళాప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. ముందుగా పెనుగొండను పట్టణ పురవీధుల్లో ఊరేగించి శివయ్య, గంగినేని, జాషువా విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం కళాప్రాంగణంలో లక్ష్మీనారాయణ దంపతులను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సత్కరించారు. కార్యక్రమంలో విద్యావంతుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు సీహెచ్ఎల్ఎన్ మూర్తి, సీనియర్ న్యాయవాది పీజే లూకా, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, సీనియర్ న్యాయవాది చెరుకూరి సత్యనారాయణ, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్ యూనిట్ కోసం జిల్లా పోలీసు విభాగ స్థల పరిశీలన

నరసరావుపేట: ఎస్‌సీ కాలనీలోని ప్రభుత్వ వైద్యశాల పక్కనే జిల్లా పోలీసు విభాగం ఆధీనంలో ఉన్న స్థలంలో క్రిటికల్ కేర్ యూనిట్(సీసీయు)ను నిర్మించేందుకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం పరిశీలించారు. ఈ స్థలంలో రూ.18కోట్ల వ్యయంతో 75 పడకల సీసీయును నిర్మించేందుకు స్థలాన్ని తమకు అప్పగించాలని వైద్యశాఖ అధికారులు కలెక్టర్, ఎస్పీలను కోరుతూ లేఖ రాశారు. దీనిపై వారందరూ స్థల పరిశీలన చేపట్టారు. ఎమ్మెల్యే చదలవాడ, ఎస్పీ శ్రీనివాసరావుల మధ్య ఆసక్తికర వ్యాఖ్యలు చోటుచేసుకున్నాయి. సార్, స్థలం ఇస్తున్నారో లేదో వెంటనే నిర్ణయించండి, ఇప్పటికే ఆలస్యమైంది, శంకుస్థాపన పెట్టుకోవాలి, నేను మంత్రి(గొట్టిపాటి రవికుమార్) దగ్గరకు వెళుతున్నా అంటూ ఎస్పీని ఉద్దేశించి ఎమ్మెల్యే అన్నారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ మాకు ప్రత్యామ్నాయం చూపించి తీసుకోండని సమాధానం ఇచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ నేను చూస్తానుగదా అంటూ వారిద్దరి మధ్య మరి కొంత మాటలు పెరగకుండా వారించారు. జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ, ఆర్డీవో కె.మధులత, తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్‌సీ అధికారులు పాల్గొన్నారు.

యువకుడి వేధింపులతో మహిళ ఆత్మహత్యాయత్నం

కొల్లూరు: వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని సహజీవనం చేస్తున్న యువకుడు వేధింపులకు పాల్పడటంతో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితను భర్త వదిలి వెళ్లిపోయాడు. తన ఇద్దరు పిల్లలను పోషించుకుంటూ కొన్నేళ్లగా ఆమె పుట్టింటి వద్ద ఉంటోంది. అదే గ్రామానికి చెందిన పరిశ గోపికృష్ణ పరిచమయ్యాడు. కొన్నాళ్ల తర్వాత సహజీవనం చేస్తున్నారు. ఆమె నుంచి అవసరాల నిమిత్తం అతడు రూ. 1.75 లక్షలు తీసుకున్నాడు. తిరిగి ఇవ్వాలని ఆమె అడగడంతో మాట దాటవేస్తూ వస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం మళ్లీ డబ్బు అవసరం ఉందని అడిగాడు. ఇవ్వడానికి ఆమె నిరాకరించడంతో వ్యక్తిగత వీడియోలు, ఫొటోలు ఆన్‌లైన్‌లో పెడతానని వేధించాడు. దీంతో బాధితురాలు ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు పేస్టును కూల్‌డ్రింక్‌లో కలిపి తాగింది. మధ్యాహ్నం కుటుంబసభ్యులు వచ్చాక గమనించి 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అర్జున్‌రావు తెలిపారు.

వ్యవసాయ కూలీ కుటుంబాన్ని ఆదుకోవాలి

- కూకట్లపల్లిలో విద్యుత్ షాక్‌తో చనిపోయిన సురభి నాగేశ్వరరావు
- కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎంపీ నందిగం సురేష్



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సురేష్

బల్లికురవ: విద్యుత్‌షాక్‌తో చనిపోయిన వ్యవసాయ కూలీ సురభి నాగేశ్వరరావు (46) కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ కోరారు. సోమవారం విద్యుత్ షాకుతో చనిపోయిన నాగేశ్వరరావు భౌతిక కాయానికి సోమవారం అర్ధరాత్రి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. రెక్కాడితే కాని డొక్కాడని ఈ కుటుంబానికి విధి విద్యుత్ రూపంలో తీరని అన్యాయం చేసిందని సురేష్ అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలెపోగు రాంబాబు, పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొంగు చంద్రశేఖర్, సాతులూరి రమేష్ తదితరులున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన గ్రానైట్ లారీ



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ధ్వంసమైన లారీ ముందు భాగం



రెండు ముక్కలైన విద్యుత్ స్తంభం

బల్లికురవ: గ్రానైట్ లారీ డ్రైవర్ మద్యం మత్తుతో రోడ్డు మార్జిన్‌లోని విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి సుమారు కిలోమీటరు దూరం ఆ స్తంభాన్ని లాక్కెళ్లాడు. ఈ ఘటన మంగళవారం అద్దంకి- బల్లికురవ ఆర్అండ్‌బీ రోడ్డులోని వల్లాపల్లి అంబడిపూడి గ్రామాల మధ్య జరిగింది. అందిన సమాచారం ప్రకారం .. అద్దంకి వైపు నుంచి బల్లికురవ, ఈర్లకొండ క్వారీల నుంచి గ్రానైట్ రాళ్లను ఎగుమతి చేసే ట్రైలర్ లారీ ఓ స్తంభాన్ని ఢీకొట్టింది. బొల్లాపల్లి సబ్‌స్టేషన్ నుంచి పెద అంబడిపూడి, చిన అంబడిపూడి , గుంటుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసే మెయిన్ లైన్‌లో స్తంభం రెండు ముక్కలైంది. లారీ మీద పడి కిలోమీటరు దూరం వరకు లాక్కెళ్లింది. ఆ సమయంలో 3 ఫేజ్ విద్యుత్ సరఫరా లేకపోవటం వల్ల పెనుప్రమాదం తప్పింది. ఏఈ పి. శ్రీనివాస్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. సిబ్బందితో కలిసి రెండు గంటపాటు శ్రమించి కొత్త స్తంభం ఏర్పాటుతో సరఫరాను పునరుద్ధరించారు. డ్రైవర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ వివరించారు.

కొనసాగిన కార్మికుల సమ్మె

నరసరావుపేట: తమకు పూర్తిజీతాలు చెల్లించాలని కోరుతూ కొంతమంది మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న నిరసన దీక్షలు మంగళవారం 48వ రోజుకు చేరాయి. యూనియన్ పల్నాడు జిల్లా కార్యదర్శి అమరారావు సాల్మన్ మాట్లాడుతూ శాంతియుత నిరసన ద్వారా తమ సమస్యలు పరిష్కారమయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు.